సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



ప్రతిభావంతులకు 'ఉపకారం'

ఎన్‌ఎంఎంఎస్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తోంది.

వివరాలు 8లో ▸



హోరాహోరీగా..

బాదేపల్లిలో జరుగుతున్న రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతుంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.2 17.9

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ చిరు జల్లులు కురవచ్చు. రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

ఖాకీల్లో బదిలీల టెన్షన్





- ఎన్నికలు ముగియడంతో ఊపందుకున్న ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో ఉన్నతాధికారుల నుంచి ఎస్‌ఐల వరకు స్థానచలనం
- ఈసారి భారీస్థాయిలో జరిగే అవకాశం
- డిమాండ్ స్టేషన్లలో పోస్టింగ్‌లకు పైరవీలు షురూ
- ఇప్పటికే నేతల టచ్‌లోకి కొందరు అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలో దాదాపు 12 నియోజకవర్గాల్లో కొత్త ఎమ్మెల్యేలు గెలుపొందారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారి పోలీసుల బదిలీలు అనివార్యమైనప్పటికీ ఈసారి గతం కంటే భారీగా జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారుల్లో చాలా వరకు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న డీఎస్పీ అధికారి నుంచి ఎస్‌ఐల వరకు బదిలీల బెంగ మొదలైంది. ఎన్నికల సమయంలో ఒకే పార్టీకి చెందిన వారికి మద్దతు ఇస్తూ ఇతర పార్టీల నేతలతో పాటు కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారని కొందరు పోలీస్ అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. నేరుగా సదరు పోలీస్ అధికారులపై ఇతర పార్టీల నేతలు విమర్శలు చేసిన ఘటనలు అనేకం. దీంతో అలాంటి పోలీస్ అధికారుల బదిలీలు జరుగుతాయా.. లేదా.. అనేది చూడాల్సి ఉంది.

ఆ పోస్టింగ్‌లకు డిమాండ్

ఉమ్మడి జిల్లాలో చాలా పోలీస్‌స్టేషన్‌లకు బాగా డిమాండ్ ఉంది. అలాంటి పోస్టింగ్‌లలో సీటు కోసం ఇప్పటికే పైరవీలు ప్రారంభించారు. ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నేతలకు టచ్‌లోకి వెళ్తున్నారు. అక్రమ దందాలు జరిగే పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్‌లు దక్కించుకోవడానికి ఎవరికి వారు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల వెంట ఉన్న పోలీస్‌స్టేషన్లతో పాటు ఇసుక అక్రమ రవాణ, స్థిరాస్తి వ్యాపారం, జూదం ఇలా యథేచ్ఛగా సాగే దందాలు జరిగే ప్రాంతాలపై దృష్టి పెట్టారు.

సిఫార్సులతోనే ఇక్కడికి..

ఏఎస్పీ, డీఎస్పీ స్థాయి నుంచి మొదలుకొని సీఐ, ఎస్‌ఐ వరకు ప్రస్తుతం పనిచేస్తున్న వారంతా బదిలీ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎన్నికలో బదిలీల్లో భాగంగా వచ్చిన వారు కాకుండా గత కొద్ది రోజులుగా స్థానికంగా విధులు నిర్వహిస్తున్న మెజారిటీ అధికారులు సిఫార్సులతోనే ఇక్కడికి వచ్చారు. ఇలాంటి వారంతా బదిలీపై వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం దూర ప్రాంతాల్లో ఉన్నవారితోపాటు ఏళ్లుగా లూప్‌లైన్‌లో పనిచేస్తున్న పలువురు పోలీస్ అధికారులు ఉమ్మడి జిల్లాకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. కొందరు అధికారులకు సమర్థత ఉన్నప్పటికీ సిఫార్సు చేసేవారు లేకపోవడంతో ఎస్‌బీ, సైబర్ క్రైం వంటి విభాగాల్లో పనిచేస్తున్నారు. అలాంటి వారు లా అండ్ ఆర్డర్ వింగ్‌లో విధులు నిర్వహించేందుకు ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

బాస్‌లను మారుస్తారా..?

ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం షెడ్యూల్ విడుదల తర్వాత నాన్ క్యాడర్ అధికారుల స్థానంలో ఉమ్మడి జిల్లాలో ఐపీఎస్ అధికారులను ఎస్పీలుగా నియమించారు. మహబూబ్‌నగర్ ఎస్పీతో పాటు నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో నాన్ క్యాడర్ అధికారులను మార్పు చేసి ఐపీఎస్‌లకు బాధ్యతలు అప్పగించింది. వీరు అధికార, ప్రతిపక్ష పార్టీలు అనే తేడా లేకుండా కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తీరును పర్యవేక్షించారు. అయితే ప్రస్తుతం కూడా వారే కొనసాగుతారా.. లేక కొత్త వారు వస్తారా.. అనేది కొన్ని రోజుల్లో తెలియనుంది. ప్రస్తుతం కొందరు కేవలం ఎన్నికల విధులు తప్ప ఇతర ఫైల్స్‌పై దృష్టి పెట్టడం లేదని సమాచారం. అత్యవసరమైతే తప్ప వాటిని చూడటం లేదని సమాచారం.

ఆర్టీషీ.. ఆనందం

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభం

- సంతోషం వ్యక్తం చేస్తున్న అతివలు
- మొదటి రోజే కిక్కిరిసిపోయిన ఆర్టీసీ బస్సులు
- హైదరాబాద్ రూట్‌లో ప్రయాణికుల సందడి



బస్సుల్లో మహిళలకు ఉచిత జీరో టికెట్‌ను అందజేస్తున్న కండక్టర్, బస్సుల్లో ప్రయాణికులతో పాటు కలెక్టర్ రవినాయక్, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి, తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, బాలికల ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ రవినాయక్ జెండా ఊపి.. మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి మొదటగా ఒక పల్లె వెలుగు, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సులో మహిళల ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెండో శనివారం సెలవు కావడం వల్ల బస్టాండ్లలో ప్రయాణికులతో పాటు మహిళలు కిక్కిరిసిపోయారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణం జీరో టికెట్లను అధికారులు మొదటగా కొంతమంది మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా ప్రధాన బస్టాండ్ల నుంచి హైదరాబాద్ రూట్‌లో ప్రయాణికులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణించడంతో బస్సులు కిటకిటలాడాయి. ఉచిత ప్రయాణం కల్పించినందుకు మహిళలు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలకు, ఉద్యోగులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కాగా.. ఇకపై మహబూబ్‌నగర్ రీజియన్‌లోని పది డిపోల్లోని 467 పల్లె వెలుగు, 263 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ప్రయాణించవచ్చు. ప్రతి రోజు రీజియన్ పరిధిలో లక్ష నుంచి 1.10లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తుంటారు. తొలిరోజు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్న మహిళలు తమ సంతోషాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.



ఉచిత జీరో టికెట్‌పై ప్రయాణం చేస్తున్న ఆశావర్కర్లు

ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయి



మహబూబ్‌నగర్ డిపో నుంచి మొదటి ఉచిత ప్రయాణికురాలు

మా పాప హైదరాబాద్‌లోని హాస్టల్‌లో చదువుకుంటుంది. నేను పాపను చూడడానికి నెలలో రెండు లేదా మూడు సార్లు హైదరాబాద్ వెళుతుంటాను. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లినప్పుడల్లా ఇక్కడ, సిటీబస్సుల్లో తిరిగితే రూ.వెయ్యి వరకు ప్రయాణం ఖర్చు అయ్యేది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సంతోషంగా ఉంది. ఇప్పుడూ వారానికోసారి పాపాను చూడడానికి హైదరాబాద్‌కు వెళతాను. ప్రయాణం ఖర్చులు ఆదా అవుతాయి.

– అమృత, దాచక్‌పల్లి (హన్వాడ)

చాలా సంతోషంగా ఉంది



నేను హైదరాబాద్‌కు వెళ్లడానికి మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు వచ్చాను. బస్సులో ఉచిత ప్రయాణం అంటే చాలా సంతోషమనిపించింది. హైదరాబాద్‌కు వెళ్లిరావడానికి బస్సుల చార్జీలకే రూ.400 నుంచి రూ.500 అవుతాయి. ఇప్పుడు ఆ ఖర్చులు లేకుండా పోయినందుకు ఆనందంగా ఉంది.

– అనంతమ్మ, కోటకొండ

ప్రభుత్వానికి ధన్యవాదాలు



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు. మా లాంటి మధ్యతరగతి ప్రజలకు కుటుంబంతో కలిసి ఎక్కడికి వెళ్లాలన్నా ప్రయాణ భారం ఎక్కువ. మా పరిస్థితిని గమనించి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణం పథకం తీసుకురావడం సంతోషంగా ఉంది.

– పద్మ, మహబూబ్‌నగర్

రూ.వెయ్యి వరకు ఆదా..



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసినప్పుడు నెలకు దాదాపు రూ.1000 నుంచి రూ.1200 వరకు ఖర్చు అయ్యేది. ఇప్పుడు ఆ ఖర్చు మిగిలింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని, దీంతో ఆధార్‌కార్డు తీసుకొచ్చా. బస్సులో హైదరాబాద్ వరకు ఉచితంగా ప్రయాణం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– చంద్రకళ, మాచన్‌పల్లి

ఉచిత ప్రయాణం ఊహించలేదు



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఊహించలేదు. ఎలాంటి చార్జీ లేకుండా తెలంగాణ వ్యాప్తంగా మహిళలకు ప్రయాణం చేయడానికి అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటి నుంచి ప్రయాణ చార్జీలు ఇక లేనట్లే.

– శైలజ, బాదేపల్లి

గొప్ప వెసులుబాటు..



దేవరకద్ర నుంచి మహబూబ్‌నగర్ వరకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం సంతోషంగా ఉంది. బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు భారమయ్యేవి. ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ప్రయాణ సౌకర్యం మహిళలకు ఒక గొప్ప వెసులుబాటు.

– సరోజాదేవి, కల్వకుర్తి

కొన్ని రోజుల తర్వాత చూద్దాం



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం బాగానే ఉంది. బస్సుల్లో ఎక్కువగా మధ్యతరగతి ప్రజలే ప్రయాణం చేస్తుంటారు. వారి కుటుంబాలకు కొంతవరకు ప్రయాణ ఖర్చులు తగ్గినట్లు. అయితే ఈ స్కీం ఎంత వరకు అమలవుతుందో కొన్ని రోజుల తర్వాత చూస్తే తెలుస్తుంది.

– అంకిత, మాచారం

ఇతర వస్తువులపై భారం వద్దు



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడం సంతోషంగానే ఉంది. అయితే బస్సు ఖర్చులను ఇతర నిత్యావసర వస్తువులపై వేయవద్దు. వస్తువులపై ధరలు పెంచి భారం వేస్తే కొంత ఇబ్బందే.

– విజయ, కల్వకుర్తి

విశేష స్పందన వచ్చింది



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి తొలి రోజునే మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఎంతో సంతోషంగా ప్రయాణం చేశారు. ప్రభుత్వానికి, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. రీజియన్‌లో ప్రతి రోజు దాదాపు 2.50లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారు. 2.45లక్షల మంది కేవలం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణం చేస్తుండగా ప్రతి రోజు లక్షకు పైగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. నాలుగైదు రోజుల్లో రీజియన్‌లో ఎంతమంది మహిళలు ప్రయాణం చేసింది ఒక అంచనాకు వస్తాం.

– వి.శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

ఉచిత ప్రయాణంపై అవగాహన



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై డిపో సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. డిపో పరిధిలోని జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర పాయింట్లతో పాటు అన్ని బస్టాండ్లలోని సిబ్బంది మహిళలకు ఈ సౌకర్యం గురించి అవగాహన కల్పించడంతో పాటు బస్సుల్లో ప్రయాణం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. డిపో పరిధిలో రోజువారీ ఎంత మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్న వివరాలు వారం రోజులు పట్టే అవకాశం ఉంది.

– సుజాత, డిపో మేనేజర్, మహబూబ్‌నగర్

జూపల్లికి ఎక్సైజ్, పర్యాటకం

- మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు దక్కిన సముచిత స్థానం
- నల్లమల, సోమశిల పర్యాటక అభివృద్ధికి అవకాశం



అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మంత్రి జూపల్లి


సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి పదవి మరోసారి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకే దక్కింది. నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రిగా కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టబెట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పాటు, తాజాగా మరోసారి పాలమూరు జిల్లాకే ఆ శాఖల బాధ్యతలు రావడంతో నల్లమల ప్రాంతం, ఇక్కడి విశిష్టమైన వన, జంతు సంపద, ఎకో టూరిజం, కృష్ణాతీర ప్రాంతాల అభివృద్ధిపై జిల్లావాసుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త ప్రభుత్వ పాలనలో ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, దర్శనీయ స్థలాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి.. అభివృద్ధి పనులు కొనసాగుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో తొలి విడతలో మంత్రిగా ప్రజలకు సేవలందించే అవకాశం దక్కింది. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తా. పాలమూరులోని నల్లమల ప్రాంతం, ఎకో టూరిజం, కృష్ణాతీర ప్రాంతాలు, సోమశిల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తా. పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచేందుకు అందరి సహకారంతో ముందుకెళ్తాను.'

– జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, ఆర్కియాలజీ శాఖల మంత్రి

పర్యాటకం రంగంపై..

ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయి. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద నిర్మించిన భారీ రిజర్వాయర్ల వద్ద బోటింగ్ ఏర్పాటు, సౌకర్యాల కల్పనతో పెద్దఎత్తున పర్యాటకలను ఆకర్షించేందుకు ఆస్కారం ఉంది. పురాతన ఆలయాలు, ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద సౌకర్యాల కల్పనతో పర్యాటకం పెరగనుంది. జోగుళాంబ శక్తిపీఠం, నల్లమలలోని శైవక్షేత్రాలు, శ్రీశైల ఉత్తర ద్వారంగా పేరొందిన ఉమామహేశ్వర క్షేత్రం, మన్యంకొండ తదితర ప్రాంతాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి పర్చాల్సి ఉంది. పురావస్తు శాఖ సైతం జూపల్లి పరిధిలోనే ఉండగా.. జోగులాంబ శక్తిపీఠం సమీపంలోని పురాతన బ్రహ్మదేవాలయాలు, క్షేత్ర అభివృద్ధిపై మరింత దృష్టిసారించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నల్లమల అటవీప్రాంతం



ఆక్టోపస్ వ్యూ పాయింట్

ఎకో టూరిజంతో మేలు..

ప్రకృతి రమణీయ ప్రాంతాలు, సహజసిద్ధమైన వనాలు, వన్య మృగాలను సంరక్షిస్తూనే పర్యాటకులను ఆకర్షించే ఎకో టూరిజం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించాలన్న డిమాండ్ స్థానికుల్లో నెలకొంది. ప్రధానంగా నల్లమల అభయారణ్యంలో పర్యాటకులు, సందర్శకుల ద్వారా పర్యావరణానికి ఇబ్బంది లేకుండా ఎకోటూరిజం ద్వారా అమూల్యమైన వృక్షసంపద, వన్యప్రాణులను వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇప్పటికే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో టైగర్ స్టే ప్యాకేజీ, టైగర్ సఫారీ, వ్యూ పాయింట్ వీక్షణం కొనసాగుతున్నా పర్యాటకులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో లేవు. అలాగే కృష్ణాతీర ప్రాంతంలోని సోమశిల, అమరగిరి, మంచాలకట్ట, మల్లేశ్వరం తదితర తీరప్రాంతాల్లో కాటేజీలు, బోటింగ్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఎకో టూరిజం, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానికంగా ఉన్న యువత, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం దక్కనుంది.

న్యూస్‌రీల్

ఆర్‌ఎన్‌ఆర్‌కు రికార్డు ధర

- బాదేపల్లి మార్కెట్‌లో క్వింటా రూ.3,356

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ధాన్యానికి రికార్డు స్థాయి ధర దక్కింది. ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి క్వింటాలు గరిష్టంగా రూ.3,356, కనిష్టంగా రూ.1,769 ధరలు లభించాయి. అదేవిధంగా హంస రకానికి గరిష్టంగా రూ.2,056, కనిష్టంగా రూ.1,810, శ్రీరాంగోల్డ్ ధాన్యంకు రూ.2,937, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,352, కనిష్టంగా రూ.2,050, పత్తికి గరిష్టంగా రూ.6,949, కనిష్టంగా రూ.4,890 ధరలు పలికాయి.

■ దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో శ్రీరాంగోల్డ్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.3,269, కనిష్టంగా రూ.2,813గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ.2,032, కనిష్టంగా రూ.1,853గా ధరలు లభించాయి. ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,412, కనిష్టంగా రూ.5,384గా ధరలు వచ్చాయి.

రఘుపతిపేట రైతుకు జాతీయ అవార్డు



కల్వకుర్తిరూరల్: రఘుపతిపేటకు చెందిన రైతు అనంత ప్రవీణ్‌రెడ్డికి జాతీయ అవార్డు లభించింది. మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డును ఆయన అందుకున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో కృషి జగ్రాన్ యూనివర్సిటీ దేశంలోని 29 రాష్ట్రాల నుంచి ఉత్తమ అభ్యుదయ రైతులకు ఈ అవార్డు అందించింది. ఢిల్లీలో జరిగిన ఈ అవార్డు ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవరత్ హాజరయ్యారు. కల్వకుర్తి మండలం రఘుపతిపేటకు చెందిన అభ్యుదయ రైతు ప్రవీణ్‌రెడ్డి కొత్త వరి రకాలను సాగు చేయడం, నూనె గింజల పంటలను, పత్తి తదితర వాణిజ్య పంటలతో పాటు సాగు చేయడంలో దిట్ట. అధునాతన పద్ధతులలో వ్యవసాయం చేస్తూ సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ తుంపర సేద్యం, బిందు సేద్యం చేస్తూ అతితక్కువ వ్యయంతో పంటలు పండించి అధిక లాభం గడిస్తున్నారు. మామిడి తోటల నిర్వహణకు ప్రత్యేక పద్ధతులను చేపడుతూ వినూత్నంగా వ్యవసాయం చేస్తున్నాడు. రైతు ప్రవీణ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జిల్లా నుంచి ఈ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

పేదలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



ఆరోగ్య శ్రీ కింద ఏర్పాటు చేసిన రూ.పది లక్షల వైద్యం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్

పాలమూరు: జిల్లాలో ఉన్న మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు, పాఠశాల, కళాశాల విద్యార్థినిలు, పని చేసే మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికి అయినా తెలంగాణ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని కలెక్టర్ జి.రవినాయక్ వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో మహాలక్ష్మీ, చేయూత పథకాల్లో భాగంగా మహిళల ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.పది లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సదుపాయాల గ్యారంటీ పథకాలలో భాగంగా రెండు పథకాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెండు పథకాలకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. జిల్లాలో 70 పల్లె వెలుగు బస్సులు, 36 ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద ప్రతి ఏడాదికి కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలు ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ఆర్టీసీ బస్సులో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పల్లె వెలుగు బస్సులు, మెట్రో సర్వీసులు, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు ముందుగా రిజర్వేషన్ చేసుకున్న బస్సులలో తప్పా అన్నింటిలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు అని తెలిపారు. చేయూత పథకం కింద రాజీవ్ ఆరోగ్య శ్రీలో భాగంగా గుర్తించిన ఆస్పత్రుల్లో రూ.పది లక్షల వరకు ఉచిత వైద్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అదనపు ఎస్పీ రాములు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్, డీఎస్పీ మహేష్, డాక్టర్ భాస్కర్, ఆర్‌ఎం శ్రీదేవి, డీటీఓ దుర్గా ప్రమీల, ఎంవీఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో పూజలు

కొల్లాపూర్: సప్తనదుల సంగమ స్థానమైన కృష్ణానదిలో సంగమేశ్వరాలయం పూర్తిగా తేలింది. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నిండుగా ఉండే సమయంలో ఈ ఆలయం పూర్తిగా నీటిలో మునిగిపోతుంది. నదిలో నీటిమట్టం తగ్గిన తర్వాత మళ్లీ దర్శనమిస్తుంది. ప్రతి ఏటా జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరిలో ఈ ఆలయం తేలుతుంది. అయితే ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవకపోవడం, వరదలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో కృష్ణానదిలో నీటి మట్టం తగ్గింది. దీంతో డిసెంబర్ నెల ప్రారంభంలోనే ఆలయం పూర్తిగా తేలడంతో వారం రోజులుగా ఆలయ ప్రధాన అర్చకులు రఘురామశాస్త్రి సంగమేశ్వరునికి పూజలు జరిపిస్తున్నారు. కార్తీక మాసంలో ఆలయంలో పూజలు జరగడం దశాబ్దాల కాలం తర్వాత ఇదే తొలిసారని భక్తులు చెబుతున్నారు.



క్లుప్తంగా

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాసులు(ఫైల్)

లింగాల: మండలంలోని దారారం చెందిన ఆవుల శ్రీనివాసులు(43) ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆవుల శ్రీనివాసులు శుక్రవారం కుటుంబసభ్యులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లి పోయాడు. వ్యక్తి గురించి కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గ్రామానికి సమీపంలో ఉన్న పచ్చగట్టు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడగా గమనించిన కొంతమంది కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి కొంతకాలంగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలు ఉండడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామ స్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సం తానం ఉన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పొలం పనులు చేస్తూ కూలీ మృతి


కురుమన్న (ఫైల్)

అమరచింత: పొలం పను లకు వెళ్లిన కూలీ కురుమన్న (49) అక్కడి కక్కడే ఆకస్మికంగా మృతి చెందిన ఘటన మండ లంలోని పాంరెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. పాంరె డ్డిపల్లెకు చెందిన కురుమన్న వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిం చుకుంటున్నాడు. శనివారం గ్రామానికి చెం దిన సంజీవరెడ్డి పొలానికి నారుమడి కోసం చదును చేయడానికి వెళ్లాడు. పొలంలో పనిచే స్తుండగా అకస్మాత్తుగా కిందపడ్డాడు. స్పృహ కోల్పోయిన ఆయనను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి మృ తి చెందినట్లు ధృవీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగ న్మోహన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

బల్మూర్: వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటకు నీరు పారించే క్రమంలో విద్యుదా ఘాతానికి గురై రైతు దుర్మరణం చెందిన సం ఘటన మండలంలోని రాంనగర్ వద్ద శని వారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు జబ్బు లచ్చయ్య(45) తన వ్యవసాయ పొలంలో వేరుశనగ పంట సాగుచేశాడు. శనివారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ అం తరాయంతో బోరు మోటార్ నిలిచిపోయింది. దీన్ని చూడటానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రైతు వెళ్లగా అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్ తీగ లను గమనించక వాటిపై కాలు పెట్టడంతో షాక్‌తో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తన భర్త ఎంతకు రాకపోవడంతో భార్య పద్మమ్మ వచ్చి చూడగా విగతజీవిగా పడి ఉం డటంతో బోరున విలపించింది. గమనించిన చుట్టుపక్కల రైతులు వచ్చి ఆస్పత్రికి తరలిం చే ఏర్పాట్లు చేయగా అప్పటికే మృతి చెంది నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అం దించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతు నికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు.

రోటోవేటర్‌లో పడికూలీ..

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంప ల్లిలో ప్రమాదవశాత్తు రోటోవేటర్‌లో పడి కూలీ దుర్మరణం చెందాడు. ఎస్ఐ శ్రీనివా సులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చౌదర్‌పల్లి దశరథ(48) గ్రామంలో కూలీ పనులు చేసేవాడు. అప్పుడప్పుడు ట్రాక్టర్ కూడా నడిపేవాడు. ఈక్రమంలో శని వారం గ్రామానికి చెందిన బయ్య కృష్ణయ్య ట్రాక్టర్‌తో ఓ రైతు పొలంలో కరిగెట చేయడా నికి వెళ్లాడు. పొలంలో ట్రాక్టర్ రోటోవేటర్ ద్వారా కరిగెట చేస్తుండగా అనుకోకుండా ట్రాక్టర్ ఆగిపోయింది. ఈక్రమంలో దాన్ని చూసేందుకు వెనక్కి రాగా దురదృష్టవశాత్తు రోటోవేటర్‌లో పడిపోవడంతో అందులో ఇరుక్కుని దుర్మరణం చెందాడు. మృతునికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమా రుడు ఉన్నారు. దశరథ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

జడ్చర్ల: మహిళ హత్య కేసులో నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. జడ్చర్ల మండలం తంగెళ్లపల్లికి చెం దిన రాఘవేందర్, బాదేపల్లికి చెందిన ఉమా దేవిలు భార్యాభర్తలు. వీరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకుని విడిగా ఉం టున్నారు. ఈనెల 30న ఓటు వేసేందుకు ఉమాదేవి తంగెళ్లపల్లికి వెళ్లగా.. రాఘవేందర్, ఆమె మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో కర్రతో ఉమాదేవి తలపై కొట్టడం తో తీవ్రంగా గాయపడింది. ఆమెను హైదరా బాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఈనెల 5న మృతి చెందిం ది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శనివారం నిం దితుడు రాఘవేందర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

..అనే నేను

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారితో శనివారం అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి (కొడంగల్), మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు.


పర్ణికారెడ్డి, నారాయణపేట


వాకిటి శ్రీహరి, మక్తల్


జి.మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర


యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పాలమూరు


జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, జడ్చర్ల


కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, నాగర్‌కర్నూల్


కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి


చిక్కుడు వంశీకృష్ణ, అచ్చంపేట


తూడి మేఘారెడ్డి, వనపర్తి


వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్


బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల


విజయుడు, అలంపూర్

ప్రతిభావంతులకు ఉపకారం

- నేడు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష
- నాగర్‌కర్నూల్‌లో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 649 మంది విద్యార్థులు



కందనూలు: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తూ.. ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తోంది. వారికి ఐదేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తూ చదువులో ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ, స్థానిక సం స్థలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదు వుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం అందిస్తారు. మెంటల్ ఎబిలిటీ (ఎంఏటీ), స్కాటిస్టిక్ అప్టిట్యూడ్ టెస్ట్ (ఎస్ఏటీ) విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అనంతరం మెరిట్ ఆధారంగా ఉపకార వేతనాలకు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్స్..

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షకు అర్హులు. ఈ ఏడాది నాగర్‌క ర్నూల్ జిల్లా నుంచి 649మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 236 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 217, బాలికల పాఠశాలలో 196 మంది పరీక్ష రాయనున్నారు. అర్హత పరీక్షకు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు యూజర్ ఐడీ, పాస్ వర్డ్ ద్వారా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు పొందవచ్చని అధికారులు తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఏటా రూ.12వేల చొప్పున..

ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.12వేల చొప్పున విడ తల వారీగా అందిస్తారు. విద్యార్థుల బ్యాంకు ఖాతాలో స్కాలర్‌షిప్ నిధు లు జమయ్యేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎంపికైన వారు సంబంధిత ప్రధా నోపాధ్యాయుల ద్వారా బ్యాంకు ఖాతా నంబర్ల పరిశీలన చేసుకుని అందిం చాల్సి ఉంటుంది.

అన్ని ఏర్పాట్లు చేశాం



ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్ష రాసే విద్యార్థులు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించాలి. ఎలాంటి ఒత్తిడికి గురికా కుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి. – గోవిందరాజులు, డీఈఓ

మహబూబ్‌నగర్ జిల్లాలో 570మంది..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత పరీక్షకు మహబూబ్‌నగర్ జిల్లాలో 570 మంది విద్యార్థులు దరఖాస్తు చేసు కున్నారు. పరీక్ష నిర్వహణకు గాను జిల్లా కేంద్రంలోని బీపీహెచ్ఎస్, మోడల్ బేసిక్, గాంధీరోడ్డు పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు

అచ్చంపేట రూరల్: ఆటో అదుపు తప్పి బోల్తాప డిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన అచ్చంపేట మండలం నడింపల్లి శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఉప్పునుంతల మండలం వెల్టూరుకు చెం దిన ఎడ్ల నిరంజన్, నారమ్మ, పార్వతమ్మతో పాటు కుటుంబ సభ్యులు బల్మూర్ మండలంలోని పోలిశె ట్టిపల్లికి ఆటోలో వెళ్తుండగా.. నడింపల్లి గ్రామ సమీ పంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమా దంలో నిరంజన్, నారమ్మ, పార్వతమ్మకు తీవ్ర గా యాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రు లను అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ విషయమై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.


గాయపడ్డ క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కొత్తకోట రూరల్: రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొత్తకోట మండలం కనిమెట్ట స్టేజీ ఎన్‌హెచ్ 44పై శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునా థ్‌రెడ్డి వివరాల మేరకు.. ఆత్మకూర్ పట్టణానికి చెం దిన విజయలక్ష్మి కనిమెట్ట నుంచి ఆత్మకూర్‌కు వెళ్లేం దుకు గాను రోడ్డు దాటుతుండగా.. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తర లించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంట మార్పిడి.. మంచి దిగుబడి


మాగనూర్ శివారులో సాగు చేసిన వేరుశనగ పంట


వడ్వాట్ శివారులో సాగుచేసిన వేరుశనగ పంట

- ఒకే పంట సాగుతో రైతులకు నష్టం
- పంటల మార్పుతో అధిక లాభాలకు అవకాశం

మాగనూర్: పంట మార్పిడి విధానంతో రైతులకు లాభం చేకూరుతోంది. వేసిన పం టలను మళ్లీ వేయడం వల్ల నష్టం వాటిల్లు తుందని వ్యవసాయశాఖ మండల ఇన్‌చార్జి అధికారి సుదర్శన్‌గౌడ్ పేర్కొంటున్నారు. పంట మార్పిడి వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు.

పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు..

- పంట మార్పిడి మూలంగా నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది.
- భూమిలో నీటి నిల్వ ఉండే శక్తి కలిగి, భూసారం వృద్ధి చెందుతుంది.
- చీడ పీడలు దూరమవుతాయి.
- ఎస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంధ్ర తెగుళ్లను దూరం చేయవచ్చు.
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగానే ఉంటుంది.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా నివా రించవచ్చు.
- ఎంటలో నాణ్యత పెరిగి ధర ఎక్కువగా పొందే అవకాశం ఉంది.

సూచనలు..

- జొన్నపంట సాగు చేసిన పొలంలో మిరప వేయవద్దు.
- వేరుశనగ సాగుచేసిన తర్వాత మళ్లీ అదే పంట వేసుకోరాదు. దీని వల్ల ఎర్ర గొంగళి పురుగు, శనగ పచ్చ పురుగు ఆశించవచ్చు.
- శనగ తర్వాత ఆముదంలో పంట మార్పిడి చేసుకోవచ్చు.
- నులి పురుగులు ఉన్న ప్రాంతాల్లో వంగ, వెండ, టమాట, ఉలవలు, మినుము, పెసర పంటలు వేస్తే, అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి. వాటిని పంట మార్పిడి చేయరాదు.

రైతులు పాటించాల్సింది..

- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తర్వాత వేరే పంట వేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి. తేలిక పాటి నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసు కోవాలి.
- వర్షాలు అధికంగా కురిసే ప్రాంతాల్లో ఎక్కువ పంటకాలం కలిగిన కంది, నువ్వులు, వేరుశనగ వంటి పంటలు వేసు కోవాలి.
- బంకమన్ను శాతం ఎక్కువగా ఉంటే ఎర్రనేలలు, నల్లరేగడి నేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

జాగ్రత్తలు..

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసు కోవాలి.
- శనగ, బబ్బెర, మినుము, ఉలవలు, పెసర పంటలు వేయడంతో నేలను కప్పి ఉంచుతాయి. కలుపు మొక్కలను నివారించవచ్చు.
- లెగ్యూమ్ జాతి (పప్పు దినుసులు) పైర్లపై వేయడం వల్ల రైజోబియం బుడి పెలు ఏర్పడతాయి. ఇవి గాలిలోని నత్ర జనిని భూమిలో స్థిరీకరించి నేలను సారవంతం చేస్తాయి. ఈ జాతి పంట లను పచ్చిరొట్ట ఎరువులుగా వాడుకో వచ్చు.
- పత్తి పైరును మినుము, పెసర వంటి పంటతో మార్పిడి చేయడం వల్ల దోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజ ొన్న, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలు పండించాలి. దీనివల్ల వేరుశ నగ పంటలను ఆశించిన ఆకుముడత ఉధృతిని తగ్గించవచ్చు.
- వరిపైరు తర్వాత పుప్పు ధాన్యాల పై ర్లను, నూనె గింజల పైర్లను పండించడం వల్ల వరి పంటకు ఆశించే టుగ్రో వైరస్, దోమ పోటులను నివారించవచ్చు.

పప్పు దినుసుల సాగుకు ప్రాధాన్యత..



ఒకే రకమైన పంటను ఏళ్ల తరబడి వేయడం వల్ల రైతులు ఎదు ర్కొంటున్న ఇబ్బందులు తెలిసినవే. ఇలాంటి సమయంలో పం ట మార్పిడి అనేది తప్పనిసరి. ఆ దిశగా ఈ ఏడాది పప్పు దిను సులు, నూనె ధాన్యాలు, కూరగాయల పంటలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. – సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఓ, మాగనూర్

డీఆర్‌టీలో ఎంబీ మిషనరీకి అనుకూల తీర్పు


మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ డెట్ రికవరీ ట్రిబ్యున ల్‌లో ఎంబీ మిషనరీ విజయం సాధించిందని, ఈ మేరకు 44వ నంబర్ జాతీయ రహదారిపై కావేర మ్మపేట వద్ద ఉన్న ఎంబీ మెడికల్ ఆస్తులు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నట్లు న్యాయవాది జాన్‌వెస్లీ తెలిపారు. శనివారం సాయంత్రం ఎంబీ మెడికల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. 1992లో ఇక్కడ చిన్న క్లినిక్ ప్రారంభించి అనతికాలంలోనే పెద్ద ఆస్ప త్రిగా మార్చి పేదలకు మెరుగైన వైద్యం అందిం చారన్నారు. ఈ క్రమంలోనే 2006లో మెడికల్ కళా శాల ఏర్పాటు చేయాలనే సంకల్పంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అనుబంధ బ్యాంకుల్లో రుణానికి దరఖాస్తు చేయగా.. రూ.35 కోట్ల ప్రాజెక్ట్ మంజూ రైందని, వీటిని 5 విడతలుగా ఒక్కో విడతకు రూ.7 కోట్ల చొప్పున ఇచ్చేందుకు బ్యాంకు అంగీకరించి.. మొదటి విడత చెల్లించిందన్నారు. ఆ నిధులతో కొన్ని నిర్మాణాలు ప్రారంభించామని, అయితే పెరి గిన ధరల కారణంగా పూర్తిచేయలేకపోయామని, అదే సమయంలో సరైన నిర్మాణాలు లేని కారణం గా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అనుమతి రద్దు చేసిందన్నారు. నాటి నుంచి బ్యాంక్ నుంచి వచ్చిన మొదటి విడత డబ్బులు రూ.7 కోట్లకు వడ్డీ పెరిగి 2018 వరకు రూ.22 కోట్లకు చేరిందన్నారు. వడ్డీ, అసలు కట్టలేనందున బ్యాంక్ కోర్టును ఆశ్రయిం చగా.. హైకోర్టు బ్యాంక్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తర్వాత జరిగిన యాక్షన్‌లో సాయిరెడ్డి మరికొందరు కలిసి రూ.28.75 కోట్లకు మిషనరీ స్థలాన్ని పొందారన్నారు. వాస్తవానికి కొన్ని నిబంధనలు పాటించనందున ఎంబీ ప్రాప ర్టీస్ సంస్థ హైదరాబాద్‌లోని డెట్ రికవరీ ట్రిబ్యున ల్‌ను ఆశ్రయించామని, నాలుగేళ్ల పోరాటం తర్వాత ఈ నెల 6న డీఆర్‌టీ కోర్టు ఎంబీ మిషనరీకి అను కూల తీర్పు ఇవ్వడంతోపాటు స్థలాన్ని, ఆస్తులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించార న్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్తులను స్వాధీనం చేసుకుంటు న్నామన్నారు. సమావేశంలో ఎంబీసీ సంస్థ డైరెక్టర్ జార్జ్, నాగర్‌కర్నూల్ ధర్మరాజు, జడ్చర్ల ఆంద్రూస్ తదితరులు పాల్గొన్నారు.

'ఖిల్లా'లో చిరుత సంచారం?


ఖిల్లాఘనపురం సమీపంలో లేగ దూడ కళేబరం


లేగ దూడను చంపిన ప్రదేశంలో చిరుత జాడ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి సమీపంలో చిరుత సంచరిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డుకు పక్కన వెం కటాంపల్లికి చెందిన సిద్ధి పర్వతాలు పశువుల పాక ఉంది. అయితే శుక్రవారం రాత్రి చిరుత అక్కడికి వచ్చి సిద్ధి పర్వతాలు పశువుల పాక దగ్గర లేగ దూడను తీసుకువచ్చి సమీపంలోని విష్ణు అనే రైతు వేరుశనగ పంటలో వేప చెట్టు దగ్గర చంపి తిని మిగతా భాగాన్ని వేరుశనగ పంటలోనే వదిలి వెళ్లి పోయింది. శనివారం తెల్లవారుజామున వేరుశనగ పంటకు స్ప్రింక్లర్లు మార్చేందుకు వచ్చిన రైతు గమ నించి వెంటనే పర్వతాలుకు విషయం చెప్పారు. సమాచారం తెలుసుకున్న ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి భాస్కరాచారి సిబ్బంది వంశీ, ఆంజనేయు లుతో వచ్చి పరిశీలించారు. లేగదూడను చంపింది హైనా అయ్యి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పొలాలకు వెళ్లే రైతులు, రోడ్డుమీదితండా, మల్కిమియాన్‌పల్లి, ఖిల్లాఘనపురం గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు.

ఎమ్మెల్యే వాకిటి ఔదార్యం

మక్తల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన వాహనంలో ఆస్పత్రికి తరలించి ఔదార్యం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల ఫ్లైఓ వర్ బ్రిడ్జి వద్ద శనివారం నడుచుకుంటూ వెళ్తున్న మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడం తో తీవ్రంగా గాయపడింది. హైదరాబాద్ నుం చి మక్తల్‌కు వస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి.. 108కు సమాచారం ఇచ్చేందుకు యత్నించగా ఫలితం లేకపోయింది. దీంతో ఎమ్మెల్యే తన కారులో క్షతగాత్రురాలిని మహబూబ్‌నగర్ ఎస్ వీఎస్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. గాయపడిన మహిళను స్వయంగా తన వాహ నంలో ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యేకు పలు వురు ధన్యవాదాలు తెలిపారు.


క్షతగాత్రురాలిని ఆస్పత్రిలో చేర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య?

పోలీసుల అదుపులో నిందితులు

జడ్చర్ల: జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన మల్లేష్ గురువారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద హత్యకు గురయ్యాడు. ఈ కేసును పోలీ సులు ఛేదించినట్లు తెలిసింది. వివాహేతర సంబం ధం నేపథ్యంలోనే హత్య చోటు చేసుకున్నట్లు పోలీ సుల విచారణలో వెల్లడయ్యింది. ఓ మహిళతో పాటు ఇద్దరు నిందితులను పోలీసులు అదు పులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్య కేసు దాదా పుగా కొలిక్కి వచ్చిందని, త్వరలోనే నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

జనసేన కేడర్‌కు, పవన్‌కు వార్

- జనసేన వెంట టీడీపీ ఉందని ప్రజలను నమ్మించాలి
- మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య



పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుతం జనసేన కేడర్‌కు, పవన్‌కళ్యాణ్‌కు మధ్య వార్ జరుగుతోందని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'పవన్ ఓట్లు కావాలంటారు.. జనసేన నాయకులు అధికారం కావాలంటారు. ఏది ముందు ఏది వెనుక అని విశ్లేషిస్తే జేజేలు, చప్పట్లు కాదు కావాల్సింది ఓట్లు అని పవన్‌కళ్యాణ్ అంటున్నారు.. ఓట్లు సరే అధికారం సంగతేంటి అని జనసైనికులు ప్రశ్నిస్తున్నారు. ఓట్లు వేసి జనసేనను గెలిపిస్తే అధికారం అదే వస్తుందని పవన్ అంటుంటే.. అధికారం వస్తుందని నమ్మిస్తే ఓట్లు అవే వస్తాయని జనసేన నేతలు అంటున్నారు. తాను కోరుకుంటున్నది అధికారం కాదని, రాష్ట్ర శ్రేయస్సు, ప్రజాశ్రేయస్సు అని పవన్ అంటుంటే.. అధికారం చేజిక్కకుండా ప్రజాశ్రేయస్సు ఎలా సాధిస్తారని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు..'అని పేర్కొన్నారు. ప్రస్తుతం జనసేన కేడర్, పవన్‌కు మధ్య జరుగుతున్న వార్ ఇదని తెలిపారు. తెలంగాణలో రాజ్యాధికారం చేపట్టడంలో ఆఖరి వరుసలో ఉందని సర్వేలు చెబుతున్నా తన సత్తా చూపించాలనే ఆతృతతో బీజేపీతో కలిసి పవన్ ఎన్నికల రంగంలోకి దిగడం సాహసోపేతమని పేర్కొన్నారు. తెలంగాణలో రాజ్యాధికారం చేపట్టలేదని తెలిసీ ఓటర్లు తమ ఓట్లను జనసేన–బీజేపీ కూటమికి వేసి ఎందుకు చేతులు కాల్చుకుంటారని ప్రశ్నించారు. ఏపీలో పరిస్థితి మాత్రం వేరని తెలిపారు. పవన్ 60 శాసనసభ సీట్లకు తక్కువ కాకుండా పోటీచేయవచ్చని పేర్కొన్నారు. అధికారం దక్కించుకోవడం పవన్ వంతు అయితే.. జనసేన–టీడీపీ కూటమికి ఓట్లు వేసి నెగ్గించుకోవడం తమ వంతు అని జనసేన కేడర్ దృఢ సంకల్పంతో ఉందని తెలిపారు. జనసేన టీడీపీని కలుపుకొని వైఎస్సార్‌సీపీని ఓడించి రాజ్యాధికారం దక్కించుకోవడానికి, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి దగ్గరలో ఉందని తెలిపారు. టీడీపీ వెనుక జనసేన అని కాకుండా.. జనసేన వెంట టీడీపీ ఉందని చెప్పి మూడునెలల్లో అధికారంలోకి రావడం తథ్యమని ప్రజలను నమ్మించగలగాలని ఆయన పేర్కొన్నారు.


ప్రకాశ్‌రెడ్డి


సుదర్శన్‌రెడ్డి


గిరిధర్‌రావు


నిరూప్‌రెడ్డి


అశోక్‌గౌడ్


మహేందర్‌రెడ్డి

ఏజీ.. ఎవరు!?

'అడ్వొకేట్ జనరల్'కు ప్రభుత్వ పరిశీలనలో పలువురి పేర్లు

- 'న్యాయ'పరంగా సర్కార్‌కు అత్యంత కీలకమైన పోస్టు
- సమర్థత, నమ్మకానికే ప్రాధాన్యం
- నిరూప్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గిరిధర్‌రావు, మహేందర్‌రెడ్డి, అశోక్‌గౌడ్‌లలో ఒకరికి అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కీలక పోస్టులు ఎవరికి దక్కుతాయన్న లెక్కలు వేసుకోవడం షురూ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున హైకోర్టులో కీలక బాధ్యత పోషించే అడ్వొకేట్ జనరల్ ఎవరవుతారన్న దానిపై తీవ్ర చర్చ సాగుతోంది. ప్రస్తుత అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ రాజీనామా సమర్పించేందుకు సిద్ధం కావడంతో తర్వాతి ఏజీ ఎవరనేది చర్చాంశనీయంగా మారింది. ఒకసారి ఏజీ రాజీనామా ఆమోదం పొందితే.. జీపీలు, ఏజీపీల నియామకాలన్నీ రద్దవుతాయి. తిరిగి కొత్త వారిని నియమించాల్సి ఉంటుంది. స్పెషల్ జీపీలు, జీపీలు, ఏజీపీల మాట ఎలా ఉన్నా.. ఏజీ, ఏఏజీ ఎవరవుతారనేది న్యాయ



వర్గాల్లో చర్చకు తెరలేపింది.

సామాజిక సమీకరణాల కంటే సమర్థతకే మొగ్గు!

'న్యాయ'పరంగా సర్కార్‌కు అత్యంత కీలకమైన పోస్టు ఏజీ కావడంతో నియామకంలో సామాజిక సమీకరణల కంటే సమర్థతకే అవకాశం ఎక్కువ. ప్రభుత్వానికి సంబంధించిన ఎన్నో కీలక కేసులు, అనుకూల కేసుల్లో వాదనలు వినిపించే నేపథ్యంలో నమ్మకంతో పాటు ఇతర అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. న్యాయవాదుల చట్టం 1961 సెక్షన్ 16(2), రాజ్యాంగంలోని అధికరణం 165 కింద అడ్వొకేట్ జనరల్ నియామకం జరుగుతుంది.

తెలంగాణ హైకోర్టు ఏజీలు వరుసగా...

- కె.రామకృష్ణారెడ్డి (2014 నుంచి 2017 వరకు)
- దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి (2017 నుంచి 2018 వరకు)
- బీఎస్ ప్రసాద్ (2018 నుంచి 2023 వరకు)

ఏజీకి ఏయే అధికారాలంటే..

- రాష్ట్రంలోని ఏ కోర్టుకైనా హాజరయ్యేందుకు ఏజీకి పూర్తి అధికారం ఉంటుంది.
- చట్టపరమైన విషయాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇస్తుంటారు.
- ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదులు (స్పెషల్ జీపీ), జీపీ, ఏజీపీల నియామకాన్ని చేపడతారు.
- రాష్ట్ర ప్రభుత్వ విశ్వాసం ఉన్నంత వరకు (తొలగించే వరకు) ఏజీ ఆ పోస్టులో కొనసాగుతారు.

ప్రభుత్వ పరిశీలనలో ఉన్న పేర్లు...

పి. నిరూప్ రెడ్డి

సుప్రీంకోర్టులో మూడు దశాబ్దాలుగా న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. సీనియర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టులో అర్హత పొందిన తొలి తెలంగాణ వ్యక్తి. 1986లో న్యాయవాద వృత్తిలోకి వచ్చారు. తెలంగాణ ఉద్యమంలో ఢిల్లీ వేదికగా విశేష కృషి చేశారు. మేఘాలయ అదనపు అడ్వొకేట్ జనరల్‌గా, గోవా రాష్ట్ర సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈయనకు కాంగ్రెస్ పార్టీలోని ఢిల్లీ పెద్దలతో కూడా సన్నిహిత సంబంధాలున్నట్లు సమాచారం.

దేశాయి ప్రకాశ్‌రెడ్డి

గతంలోనూ ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఏఏజీగా, తెలంగాణ వచ్చిన తర్వాత హైకోర్టులో ఏజీగా పనిచేశారు. 1977లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2000 సంవత్సరంలో సీనియర్ న్యాయవాదిగా పదోన్నతి పొందారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు.

గిరిధర్‌రావు

గ్రూప్–1, గ్రూప్–2 వంటి కీలక కేసుల్లో వాదనలు వినిపించి.. విజయం సాధించారు. గ్రూప్–1 పేపర్ లీకేజీ కేసును సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని వేసిన పిటిషన్‌లో వాదనలు వినిపించారు. 38 ఏళ్ల న్యాయవాదవృత్తిలో ఉన్నారు. 2021లో సీనియర్‌గా ప్రమోషన్ పొందారు. బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్లకు ఎన్నికై సేవలందించారు.

పొన్నం అశోక్‌గౌడ్.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా, రెండుసార్లు హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. గతంలో ప్రభుత్వ న్యాయవాదిగా కూడా విధులు నిర్వహించారు.

ఇంకా..

కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తెలంగాణ నుంచి తొలిసారి ఏజీగా బాధ్యతలు నిర్వహించిన (మాజీ ఏజీ) ఎ.సుదర్శన్ రెడ్డి, రేసు మహేందర్‌రెడ్డి లాంటి సీనియర్ల పేర్లు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు హైకోర్టు న్యాయవాద వర్గాలు పేర్కొంటున్నాయి.

కోటిన్నర కుటుంబాలకు అభయం..

ఆరోగ్యశ్రీ చికిత్సకు రూ.25 లక్షలు

- ఏపీలో ప్రజారోగ్యానికి సంపూర్ణ భరోసానిస్తూ సీఎం జగన్ అడుగులు
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో రూ.లక్షలు ఖరీదైన వైద్యం పూర్తి ఉచితం

సాక్షి, అమరావతి: ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి ఊపిరిలూది పునర్జన్మ ప్రసాదించిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించాలని నిర్ణయించారు. తద్వారా గుండె, కిడ్నీ, న్యూరో లాంటి ఎంత పెద్ద జబ్బులకైనా చేతి నుంచి చిల్లి గవ్వ ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్యం అందనుంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను 1,059 నుంచి ఏకంగా మూడు రెట్లకుపైగా పెంచి 3,257కి చేర్చిన సీఎం జగన్ ఇక క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు సైతం పరిమితి లేకుండా వ్యయాన్ని భరించేందుకు సిద్ధమయ్యారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు అత్యంత సులభంగా పొందేలా ఆధునిక ఫీచర్లతో కొత్తగా కార్డులను రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18వతేదీన నూతన మార్గదర్శకాలు జారీ చేయనుంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



దేశ ఆరోగ్య రంగంలో తొలిసారిగా...

ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పలు పార్టీలు ఆరోగ్యశ్రీ తరహాలో ఉచిత వైద్యం అందిస్తామని హామీలిచ్చాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ రూ.10 లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇవ్వగా బీఆర్‌ఎస్ రూ.15 లక్షల వరకూ ఉచిత వైద్యం సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కూడా రాజకీయ పార్టీలు ఇలాంటి హామీలనే ఇచ్చాయి. అయితే దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యానికి ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం భరోసా నివ్వడం గమనార్హం. గతంలో క్యాన్సర్ చికిత్సకు ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే డబ్బులపై రూ.5 లక్షల వరకు పరిమితి ఉంది. ఆ తర్వాత ఎంత ఖర్చు అయినా రోగులే భరించాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ పరిమితిని ఎత్తివేయడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా నిస్తున్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు మార్పునకు కేంద్రం ఆమోదం

- కాకినాడ నుంచి నక్కపల్లికి మార్పు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో అభివృద్ధి... ప్రభుత్వ భూమిలోనే ఏర్పాటు చేయాలన్న కేంద్రం

సాక్షి, అమరావతి: బల్క్ డ్రగ్ పార్కును కాకినాడ నుంచి అనకాపల్లి జిల్లా నక్కపల్లికి మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పార్కును కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ రూ.2,190 కోట్లతో ఫార్మాస్యూటికల్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ఇందు కోసం రూ.1,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. భూమిని రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూరుస్తోంది. అయితే, ప్రభుత్వ భూమి మాత్రమే ఉండాలని కేంద్రం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. దీంతో కాకినాడ నుంచి నక్కపల్లి ప్రాంతానికి ఈ పార్కును మార్చారు. నక్కపల్లి వద్ద ఏపీఐఐసీ భూమి అందుబాటులో ఉండటం, అక్కడ ఇప్పటికే ఫార్మా రంగానికి చెందిన పలు పరిశ్రమలు ఉండటంతో రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలోనే టెండర్లను న్యాయ పరిశీలనకు (జ్యుడిషియల్ ప్రివ్యూకు) పంపుతామని ఏపీఐఐసీ వీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. న్యాయపరిశీలన అనంతరం ఆమోదం రాగానే టెండర్లు పిలుస్తామని చెప్పారు. చైనా నుంచి ఫార్మా దిగుమతులను అరికట్టాలన్న ఉద్దేశంతో దేశంలో మూడు బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. తెలంగాణ వంటి 16 రాష్ట్రాలతో పోటీ పడి రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును దక్కించుకుంది. పూర్తిగా పర్యావరణహితమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పార్కును అభివృద్ధి చేస్తారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఫార్మా హబ్‌గా తయారవుతుందని, రూ.14,340 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా. ఇక్కడ 30,000 మందికి ప్రత్యక్షంగా, 40,000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 200కు పైగా ఫార్మా యూనిట్లు ఉన్నాయి. బల్క్ డ్రగ్ పార్కు ద్వారా అదనంగా 100కు పైగా యూనిట్లు వస్తాయని బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.

జోగుళాంబ సన్నిధిలో మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాన్ని శనివారం మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక దర్శనాలు, అభిషేకాలు అర్చనలు చేశారు. వీరితో పాటు స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది జహంగీర్ ఉన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 398 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఆవిరి రూపంలో 67, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 161 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి 618 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇంట్లో నగదు చోరీ



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో శనివారం మధ్యాహ్నం ఓ ఇంటి తలుపులు పగుల కొట్టి నగదును అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన తిరుమల్‌గౌడ్, ఆయన భార్య చంద్రకళ కలిసి ఉదయం రాయచూర్‌కు వెళ్లారు. మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రూ.40వేల నగదును అపహరించారని బాధితులు తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యం

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం చెందిన గాదం నందిని నాలుగు రోజుల నుండి కనిపించడం లేదని తండ్రి గాదం మాధవ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెలుగు గాదం మాధవకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరి కూతుర్లకు పెళ్లిళ్లు అయిపోయాయి. కుమారుడు వనపర్తిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మూడో కూతురు గ్రామంలోనే తల్లిదండ్రులతో ఉంటుంది. ఈనెల 7న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించక పోవడంతో, గ్రామానికి చెందిన హరిశంకర్‌పై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కురుమూర్తికి పోటెత్తిన భక్తులు

- కొనసాగుతున్న జాతర ఉత్సవాలు
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

చిన్నచింతకుంట: అమ్మాపురం సమీపంలోని కాంచనగుహలో వెలసిన కురుమూర్తిరాయుడి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి తడిగుడ్డలతో మెట్లపై దీపాలు వెలిగించి.. కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. దాసంగాలు పెట్టి గండదీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయంలోని అలివేలుమంగ, ఆంజనేయ, చెన్నకేశవస్వామి, ఉద్దాల మండపం జాతర మైదానంలోని రాజగోపురం, సత్రాలు, కోనేరులతోపాటు గాజుల దుకాణాలు, ఆట వస్తువులు, రంగుల రాట్నాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు


జాతర మైదానంలో భక్తుల రద్దీ


క్యూలైన్లో నిల్చున్న భక్తులు


జాతర మైదానంలో భక్తుల రద్దీ

హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నీ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బాదేపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్–17 ఫుట్‌బాల్ టోర్నీ లీగ్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర అసిస్టెంట్ ఆర్గనైజర్ రామకృష్ణ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని సూచించారు.

నిరాశ పర్చిన బాలికల జట్టు..

టోర్నీలో మహబూబ్‌నగర్ బాలికల జట్టు సెమీఫైనల్‌కు చేరలేక లీగ్ దశలోనే వెనుదిరిగి నిరాశపర్చింది. ఆదివారం రంగారెడ్డి, ఖమ్మం జట్ల మధ్య తొలి సెమీ ఫైనల్ జరగనుంది. రెండవ సెమీ ఫైనల్ నిజామాబాద్, మెదక్ జట్ల మధ్య జరగనుంది. బాలుర జట్లకు లీగ్ దశలో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. మహబూబ్‌నగర్ బాలుర జట్టు సెమీ ఫైనల్‌కు చేరే అవకాశాలు ఉన్నాయి. ఆదివారం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లతో పాటు రాష్ట్ర జట్టు ఎంపిక చేయనున్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రామకృష్ణ


టోర్నీలో తలపడుతున్న జట్లు

పీడీఎస్ బియ్యం పట్టివేత

మద్దూరు: బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఘటన శనివారం మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ–2 శ్యాంసుందర్ వివరాల మేరకు మద్దూరు గ్రామానికి చెందిన ఎండీ ఇస్మాయిల్ మద్దూరు చుట్టు పక్కల గ్రామాల్లో సేకరించిన 14క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో కర్ణాటకా రాష్ట్రానికి తరలిస్తున్న క్రమంలో మండలంలోని ఖాజీపూర్ శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొనిస్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్యాంసుందర్ తెలిపారు.



90 గోవులకు సీమంతం


చీరలతో అలంకరించిన భక్తులు


గోమాత ఆకారంలో దీపాలంకరణ

వనపర్తి: జిల్లా కేంద్రంలోని విశ్వక్సేన గోశాలలో శనివారం కార్తీక బహుళ ద్వాదశిని పర్వదినాన్ని పురస్కరించుకుని 90 గోవులకు భక్తులు గోశాల నిర్వాహకుడు శ్రీరామానుజాచార్యుల ఆధ్వర్యంలో సీమంతం చేశారు. గోవులను కొత్త చీరలతో అలంకరించారు. అనంతరం గోవు ఆకారంలో దీపాలను వెలిగించి సర్వేజన హితం కోసం శ్లోకాలు పఠించారు.

మరణంలోనూ వీడని బంధం

- ఈనెల 7న బైక్‌పై నుంచి పడ్డ భార్యాభర్తలు
- చికిత్స పొందుతూ ఒకే రోజు ఇద్దరు మృతి

ధన్వాడ: మరణంలోనూ భార్యాభర్తల బంధం వీడలేదు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు.. చికిత్స పొందుతూ ఒకే రోజు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం బూడ్యాగానికుంట తండాకు చెందిన బాలు సుభాష్ చౌహాన్ (60), ఆయన భార్య బుజ్జి అలియస్ బుజ్జమ్మ(56)లు ఈనెల 7న బైక్‌పై ధన్వాడకు వచ్చారు. పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. మణిపూర్ తండా సమీపంలో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి కిందపడ్డారు. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. భార్యాభర్తలిద్దరు ఒకే రోజు మృతితో బూడ్యాగానితండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


సుభాష్ చౌహాన్, బుజ్జమ్మ (ఫైల్)